# తీసిపోలేదు

"జస్టిస్ దత్తాత్రేయా ! ముహూర్తం వేళయింది వచ్చి పీటమీద కూర్చోండి కమాన్. క్విక్."

అవి వివాహ మంటపంలోనుంచి వినవచ్చిన మాటలు.

షామియానాలో పదివరసల కుర్చీలు, రెండువరసల సోఫాలూ వివాహ మంటపం చుట్టూ వేసి ఉన్నాయి. గేటుదగ్గర నుంచి కాలికి మట్టి అంటకుండా కార్పెట్లు పరచి ఉన్నాయి.

షామియానా అంతా అహూతులతో కిక్కిరిసిపోయి ఉన్నది. ప్రతిస్థంభానికీ అమర్చిన ఫేన్‌లు ఆహూతులను చల్లటిగాలితో హాయిని గొల్పుతున్నాయి ఫైవ్ స్టార్ హోటల్ పరివారం కూల్‌డ్రింక్సు నందించి ఆహూతులు సావధానంగా వివాహ కార్యక్రమాన్ని పరికించే సౌకర్యాన్ని కల్పిస్తోంది.

అది ప్రఖ్యాత లాయరు నందిని ఏకైక కుమార్తె గాయత్రి, భవానీశంక రుల వివాహ సందర్భము.

గొప్ప స్టేటస్‌గల వారందరూ ముందు రెండువరసల సోఫాలలో ఆసీను లయి ఉన్నారు. జస్టిస్ దత్తాత్రేయ పెద్దహోదాలో ఉన్నవాడు ఆయన చీఫ్‌జస్టిస్ అవుతాడన్న పుకార్లతో హైకోర్టులాబీలు నిండిపోతున్నాయి వారం రోజులుగా. సోఫాలలో కూర్చున్నవారంతా దిగ్భ్రాంతులయి చూస్తున్నారు. వట్టి 'దత్తాత్రేయ' అని కాకుండా, జస్టిస్ దత్తాత్రేయ అన్న పిలుపు, గొంతెత్తి పిలిచిన పిలుపు విన వస్తున్నదే? ఆ పిలుపులో ఒక మర్యాదలేదు, మన్నన లేదు సాధికారంగా పిలిచి నట్టున్నది.

అహూతులందరూ జస్టిస్ దత్తాత్రేయ ముఖంవంకే చూస్తున్నారు. ఆ పిలుపు రియాక్షను ఆయన ముఖమ్మీద స్పష్టంగా కనబడుతోంది. ఆయన ఆ పిలుపుకు లేచి వెళ్తాడా లేదా అన్నది ముఖ్యాంశంగా తలలు తిప్పి చూస్తున్నారంతా.

వివాహమంటపం చుట్టూ ఆసీనులయిన ఆహూతులందరిలో మందస్థాయిలో గుసగుసలు, పైకి కనబడని అలజడి.

వివాహమంటపం వద్ద స్తంభాన్ని ఆనుకుని నిలబడ్డ నందిని జస్టిస్ దత్తాత్రేయ వంక గంభీరంగా ముఖం పెట్టి సూటిగా చూస్తున్నది.

రెండు, మూడు, ఐదు నిమిషాలు గడుస్తున్నాయి.

ఆమె తనచేతి గడియారాన్ని ఒకసారి చూసుకుంది.

కాలాతీతమవుతున్నది, ముహూర్తం వేళ దాటుతున్నది.

లాయరు నందిని ఆయన ఆసీనుడైఉన్న సోఫావైపు కదిలింది. మిలమిల మెరసిపోయే గులాబీరంగు జరీపోగుల చీరె, దానికి సరిపోయిన బ్లౌజు, ఆమె ఎంత దూరాన ఉన్నా ధగధగలాడుతూ హరివిల్లు రంగులతో దారిచూపుతున్నట్లుగా ఉన్న ఆమె చెవుల కమ్మలు, మెడలో సన్నటి గొలుసు, ఒక చేతికి గడియారం, మరొకచేతికొక బంగారు గాజు- తల కదిలిస్తే కదిలి ఆడే కత్తిరించిన తల వెంట్రుకలు- గంభీర ముద్రదాల్చిన ముఖం- ఆమె అడుగువేయగానే జస్టిస్ దత్తాత్రేయ మెల్లగా లేచి తన కారును సమీపించటానికి బయలుదేరాడు.

నందిని పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ కారును ఆయన సమీపించక ముందే చెయ్యిపట్టుకుని నిలబెట్టి "మన అమ్మాయి వివాహం. భవానీశంకర్, గాయత్రీ గణితశాస్త్రంలో ఉన్నతమైన డిగ్రీలందుకుని వివాహం చేసుకుంటున్నారు వచ్చేవారం అమెరికా ప్రయాణమవుతున్నారు. వాళ్ళనాశీర్వదించి వెళ్ళు. కన్నవారి ఆశీస్సులు అత్యంత ప్రధానమైనవి" అంటూ పట్టుకున్న చెయ్యి వదలిపెట్టి ముందు ఆయన మండపంవైపు నడిచివస్తుంటే తను వెనుక బయలుదేరింది.

వీరిద్దరూ మండపం చేరుకుంటూ ఉండగానే భజంత్రీలు వాద్యాలు ఊపిరి సలుపకుండా వాయించారు. దగ్గరున్న పురోహితుడు జీలకర్రా బెల్లం కలిపిన ముద్ద వధువుచేత పరస్పరం ఏకకాలమందే తలలమీద పెట్టించాడు. వెంటనే ఆశీర్వచన పూర్వకమైన అక్షతల వర్షం వధూవరులపైన కురిపించారు ఆహూతులు.

ఆ తరువాత కొద్దిసేపటికి మంగళసూత్రధారణ అయింది. ఆహూతులొక్కొక్కరే లేచి బహుమతులు గుంపులో దూ[illegible] ఇస్తున్నారు

ఈ సందడిలో ముందు కారుఎక్కి వెళ్ళిపోయిన వాళ్ళలో ప్రథముడు జస్టిస్ దత్తాత్రేయ.

అతడి మస్తిష్కంలో గాలి దుమారం చెలరేగి తుఫానుగా మారింది. దాని నెదుర్కోలేక అదిరిపోతున్న తలను రెండు చేతులతో పట్టుకుని కోర్టుకు చేరబోతున్న కారును ఇంటివైపుకు మళ్ళించ మన్నాడు డ్రైవర్ని. ఇల్లు చేరుకుని గబగబా మెట్లెక్కి తన గదిలో బట్టలు మార్చుకున్నాడు. మంచమ్మీద అడ్డంగా పడ్డాడు.

పాతికేళ్ళనాడు జరిగిన సంఘటనను ఈనాడు ఇంతమందిలో జస్టిస్ అయిన తనమీద ఈ విధంగా కసి తీర్చుకుంటుందా? అంతమందిలో రభస ఎందుకని తను వెళ్ళి వధూవరులమీద అక్షతలు వేసి వెనక్కు తిరిగాడు పరువుకోసం.

ఎవరి మనసుల్లోనూ సందేహాలు తలెత్తకుండా, ఉన్నతోద్యోగి కనుక మొదట ఆశీర్వదించమని అర్థించింది కనుక, కోర్టులో కేసును తిప్పినవిధంగా తిప్పవచ్చుననుకున్నాడు.

కాని, ఆయనను ఎదురుపడి "ఆమెకూ నీకూ ఏమిటి సంబంధం? ఏసంబంధమూ లేకపోతే అలా పదిమందిలో "జస్టిస్ దత్తాత్రేయా, వేళయింది పీటమీద కూర్చోమని బిగ్గరగా కేకవేస్తుందా? అదికూడా ఆజ్ఞాపూర్వకంగా?" అని ఎవరయినా అడుగుతారా? అడిగి సందేహం తీర్చుకుంటారా?" అది ఆధునిక మర్యాదనిపించుకోదు మరి. కాని, మనసుల్లో గుణించుకుని గోరంతను కొండంతగాచేసి దానికి ప్రాణంపోసి ఊరంతా ప్రచారం చేస్తారుగాని ఊరికే పోనిస్తారా ఈ సంఘటనను అందరూ?

విన్నవాళ్ళూ కన్నవాళ్ళూ వాళ్ళ పనుల్లో వాళ్ళుండగా నందిని తను గెలిచానన్న సంబరంతో వైభవంగా కూతురికి పెళ్ళిచేసి ఇద్దరినీ అమెరికాకు పంపించింది. పెళ్ళి అలసట తీరింతరువాత తీరిగ్గా కోర్టుకు వెళ్ళుతోంది.

కాని, ఓడిపోయిన ముఖమెట్లా ఉందో చూద్దామనుకుంటే జస్టిస్ ఏకంగా నెల రోజులు సెలవుపెట్టేశాడు.

ఆయన అలా సెలవు పెట్టకుండా ఉంటే నలుగురి నోళ్ళల్లో పడిన ఈ ఉదంతం అంత ప్రచారానికి రాకపోను.

ఆమె అంత పొంగిపోకాపోను.

కాని, పాపం ఆమె, ఒక అయినింటపుట్టిన ఆడపిల్ల, ఎంతకాలం నుంచీ ఆ అపవాదు భారం మోస్తున్నది? కన్నవారి ప్రాపకం వదలుకొని, బంధువుల అపనిందలు భరించింది?

కన్యగా గర్భవతి అయింది?

ఇది ఎంత నరకప్రాయమైన విషయం ఆడపిల్లకి?

భారతంలోని కుంతి ఈ భారాన్ని ఈనాటికి మోస్తునేఉంది. తన జీవితంలో ఎన్ని మధురానుభూతులను పోగొట్టుకున్నది? కర్ణుడికి తల్లిదండ్రులెవరో తెలియక ఘోరావమానాలను సహిస్తూ కన్నతల్లి మీద ఎంతకక్షను పంచుకున్నాడు? సోదరుడి పరాక్రమాన్ని చూసి సంతోషించలేక అతడిని అంతంచేయాలని ఎన్నిసార్లు పళ్ళు పటపట లాడించాడు?

అయితే ఆమెనెవరూ మోసగించలేదు నిజానికి.

ఆమె పరీక్షించాలని వేడుకతోచేసిన పనికి ఫలితాన్ని అనుభవించింది. ఆమె నశించినా అపవాదు నశించలేదు.

కాని నందిని విషయమట్లాంటిది కాదు.

తను ఇంటర్ చదువుతోంది. దత్తాత్రేయ బి.ఏ చదువుతున్నాడు. ఇద్దరికీ ముందు చూపులు కలిశాయి. ఆ తరువాత మాటలు కలిశాయి. తరువాత బీచ్‌లో సమావేశాలు జరిగాయి. మనసులు కలిశాయి.

అయితే ఈ మనసులుకలిసిన తరువాత ఇంకేమభ్యంతరం మనుకున్నారు. తమకుతామే పెద్దలమనుకుని ముందడుగువేశారు. కాని-తామనుకున్న పెద్దలు నిజస్వరూపందాల్చి పెళ్ళికి అంతస్తులభేదాన్ని ఎత్తిచూపించారు. ఈ పెళ్ళి జరగటానికి వీలుకాదని దత్తాత్రేయ తండ్రి వాళ్ళిద్దరినీ కలుసుకోకుండా చేశాడు.

దత్తాత్రేయకు తమ సమాగపు పర్యవసానమేమిటోతెలియదు. ఒకవిధంగా నందినికికూడా తెలియదనే చెప్పాలి.

పట్టిపట్టి స్నేహాలేగా? వాటిని అరికట్టేశామనుకున్నారు రెండు పక్షాలవాళ్లు.

దత్తాత్రేయ బి.ఏ పూర్తిచేసుకుని మరొకఊళ్లో లా చదివాడు. ఎడ్వొకేటుగా ఎన్‌రోల్ అయ్యాడు.

కాని-నందిని విషయం అంత సులభంగా తుడిచివేయ తగినదికాదు. ఆడ పిల్ల చేసినపనికి ఫలితాన్ని అనుభవించవలసి వచ్చింది. పెద్దవాళ్ళకు తెలియగానే ముందు అమ్మాయిని మానసికంగా బాధించారు. ఒక్కతేకూతురు కనుక కష్ట నష్టాలకు ఓర్చుకోదలచుకుని దూరాన ఒక మహానగరంలోఉన్న పెదతల్లిదగ్గరికి తీసుకవెళ్ళి నెలలునిండిన తరువాత పురుడుపోశారు ఆస్పత్రిలో.

అప్పుడు ఎదురయింది పుట్టిన పాపను ఏంచెయ్యాలనే ప్రశ్న.

పాపను వదిలించుకుందామని "దయార్ద్రహృదయ" అనిపించుకున్న నందిని తల్లికే అనిపించింది. "ఏదో ఒకటిచేయండి" అన్నాడు తండ్రి.

కాని-నందిని దత్తాత్రేయను మరిచి పోలేకపోతోంది. తనకు పుట్టినబిడ్డను దూరం చేసుకోవటానికిగాని-అంతం చేయటానికిగాని ఆమె మనసు అంగీకరించటం లేదు. తల్లిదండ్రులు పెళ్ళికాని కూతురు తల్లి అయినదంటేనే భరించలేక పోతు న్నారు. సమాజంలో తలఒంచుకుని బ్రతుకుతున్నారు. తన చదువయ్యేవరకూ ఈ బిడ్డను భరించగలరా?

పెదతల్లి ఒంటరిది. ఈ బిడ్డను పెంచమని నందిని అడగగానే అంగీక రించింది.

నందిని తనకుపెళ్ళి అక్కర్లేదన్నది. చదువు సాగించటం మొదలుపెట్టి తను లా క్లాసులోచేరింది. నిర్ణీతకాలానికి లాయరైంది. కొంత అనుభవం సంపా దించుకున్న తరువాత మహానగరంలో హైకోర్టు లాయరైంది. పట్టుదలతో తెలివి తేటలతో అనుభవంగల పెద్ద లాయరైంది. తన ఏకైక పుత్రికను తీసుకువచ్చి స్కూల్లో చేర్చింది. తండ్రిపోయినా తల్లితో-పాపతో ఘనంగా బ్రతుకుతోంది.

"కొత్త ఊరు-కొత్త మనుష్యులు మన సంగతి వాళ్ళకేంతెలుసు?" అని అనుకోవటానికి వీల్లేదు. మూలం తెలుసుకోవాలని తాపత్రయపడి పరిశోధనకు పూనుకునేవారు ఎప్పుడూ ఎక్కడైనాఉంటారు ఐకమత్యంతో విచారిస్తారు.

"లాయరమ్మకు పెళ్ళికాలేదు. ఇంట్లోచిన్నపిల్ల పెరుగుతుంది. పెద్దామెకు

ఇంకొక సంతానంలేదు. మరి-ఈ పిల్ల ఎవరిపిల్ల?" ఇది లోకానికి చిత్తసంక్షోభగా ఉంది.

కొందరు గంభీరంగా వాళ్ళల్లోవాళ్లే సమాధానపడి ఊహించుకుని తృప్తి చెందారు కొందరు ఆమెను అడగనే అడిగారు.

"మీకు సందేహం కలగగానే అడక్కపోయారా? ఈ పాప నా పాప" అని ధైర్యంగా చెప్పింది నందిని.

ఆమె సమాజాన్ని గురించి పట్టించుకోదు! పాపకు తను తల్లి. పాప భవిష్యత్తును ఏలోపంలేకుండా తీర్చిదిద్దాలి? ఇవే ఆమె ఆశయాలు-ఆశలు.

అక్కడినుంచి ఆమె ప్రాక్టీసు బాగా పుంజుకొంది. తన స్థాయికి తగినట్టు పెద్ద భవనం కట్టింది. ఒక కారుకొన్నది అమ్మాయిని స్కూల్లోదింపి కోర్టుకు వెళ్తుంది వచ్చేటప్పుడు తీసుకువెళ్తుంది.

అమ్మాయి స్కూల్లో తండ్రిపేరు దత్తాత్రేయ.

తల్లిపేరు నందిని.

"ఒక జీవి లోకంలో మనటానికి పుట్టకకు కారణమైన తలిదండ్రుల పేర్లు చెబితేనే ప్రమాదమా? దీనిలో వ్యక్తిగతమైన ఇష్టాఇష్టాల ప్రసక్తిఉందా? ఉంటే వాటికి ప్రాధాన్యత ఇవ్వాలా?" అన్న ఉద్దేశ్యమామెది.

పసిపాపకు తల్లిదండ్రుల పేరు చెప్పుకునే హక్కులేదా?

తల్లిదండ్రుల తొందరపాటుకు పాప బాధ్యురాలుకాదు అని నందిని నిర్ధారణకు వచ్చింది.

కాని దత్తాత్రేయను మనసారా నమ్మిన నందిని అతడి ఆచూకి తెలుసుకుంటునేఉంది. "మనకొక పాప పుట్టి పెరుగుతోంది. అచ్చు నీలాగేఉంటుంది. దాన్ని చూస్తే నిన్నుచూసినట్టే ఉంటుంది. నా మాట అబద్ధమనుకుంటే ఈ ఫోటో చూడు" మంటూ ఫొటోపంపించింది. జవాబురాకపోతే చేరలేదేమోనని ఇంకొకటి పంపించింది.

ఆయన రాయకపోయినా తను మాత్రం వారానికొక ఉత్తరం రాస్తూ వచ్చింది. కాని ఒక్క ఉత్తరమైనా అతడినుండి అందుకోలేక పోయింది.

కోర్టులో మొట్టమొదటిసారిగా ఆమెనుచూసిన దత్తాత్రేయ ఉలిక్కిపడ్డాడు. అదీ ఆమె గమనించింది. అప్పటినుంచీ ఆమె కేసు వాదించటానికి లేచినప్పుడల్లా అతడికి దేహంవణికేది. కాని-ఆమె తనకేసువాదించి గెలుపొందినగర్వంతో ఎదుటి పక్షం లాయరువైపు ఒక చూపుచూసేది. జస్టిస్ వైపొక నిర్లక్ష్యపుచూపు విసిరేసి తన సీట్లో కూర్చునేది.

ఇంతకుమించి మాటలూ సంప్రతింపులు పెట్టుకోలేదు. ఎవరి జీవితాలు వారివి అనుకుంది.

అన్ని కేసులలో గెలుపు ఆమెదే.

దానివల్లకూడా సమాజానికొక చిక్కు వచ్చిపడది.

'ఆమెపట్ల ఆయనకెంత అభిమానమో? అందుకే ఆమె పట్టినదల్లా బంగార మవుతోంద'ని లోకం క్షోభించిపోయింది.

ఆమెచేతిలో పెడితేచాలు కేసుగెలుస్తుందని కక్షిదారులకందరికి తెలిసి పోయింది.

కోర్టులో ఉన్నంతసేపూ తన సామర్థ్యాన్ని వ్యక్తం చేసుకునే నందిని-డబ్బు లెక్కచూసుకుని బ్యాంకులో వేసుకునే నందిని- ఇంటికి రాగానే ముఖం చిన్నబుచ్చుకుని తిరిగేది.

ఈ గెలుపా తను కోరుకున్నది ?

ఈ గెలుపుకోసమా తన తండ్రి అలమటించి చనిపోయింది ?

దీనికోసమా తల్లి మంచానికంటుకుపోయింది ?

సమాజంలో ఒక గౌరవమైన స్థానంకోసం అలమటించారు వాళ్ళు.

కాని- రాను రాను నందిని సున్నితహృదయం శిలా సదృశమైంది. సమయం దొరికితే దెబ్బతీయాలని చూస్తోంది.

స్త్రీలను గురించిన కేసు వాదించేటప్పుడు పురుషులను తూర్పారపడుతోంది. ఏమాత్రం లెక్కచెయ్యటంలేదు.

ధర్మసింహాసనంపై ఆసీనుడవయినా నీవూ సామాన్య పురుషుడివేనని తన కూతురిపెళ్ళిలో నలుగురిలో వేలెత్తి చూపించింది.

అదిచాలదూ ఆయన గౌరవప్రతిష్ఠల అవరోహణకు ?

కాని- దానికి దీనికి సంబంధం లేనట్టుగా ఆయన చీఫ్ జస్టిసయ్యాడన్న వార్త టివీలో ప్రకటించబడ్డది. పూలహారాలతో గదంతా నిండిపోయింది. వచ్చే వారూ అభినందించేవారూ లెక్కకు మీరిపోయారు.

నలుగురితోపాటు నందినికూడా వెళ్ళింది. గంపనిండా పళ్ళూ స్వీట్లూ తీసుకువెళ్ళింది. కాని అందరితోపాటు పూలహారం మెడలో వెయ్యకుండా- చేతులు జోడించకుండా కరచాలనంచేసి అభినందించింది.

దత్తాత్రేయ కళ్ళు ఒప్పగించి చూశాడు.

మరుసటి సంవత్సరం దత్తాత్రేయ కూతురి పెళ్ళయింది. నలుగురితోపాటు తనకు వచ్చిన ఆహ్వానాన్ని అందుకున్నది నందిని. సకాలానికి వెళ్ళి వధువుకు రవ్వలుతాపిన ఉంగరాన్ని బహూకరించి ఇంత ఘనంగా కూతురి పెళ్ళిచేసి నందుకు ఆయనను అభినందించి వచ్చింది.

దత్తాత్రేయకు తన తల భూమిలోకి దిగిపోతున్నట్లనిపించింది. ఆయన ముఖమ్మీది చిరుచెమటలను ఫాన్‌గాలి సమీపించలేకపోతున్నది.

అతడి పెదవులు కదలుతున్నాయి గాని మాటలు పైకి రావటంలేదు.

కాని- అతడి మనసులో ప్రశ్నల పరంపర- దత్తాత్రేయా ఇవి నీకు అభి నందనలా ? లేక .. ........ ?

ఇది నిన్ను గౌరవించటమా—లేక............ ?

